# పంతం

- కొలకలూరి ఇనాక్

**చంద్రి నెత్తి మీది మల్ల తొణికిసలాడుతూ ఉంది. చాటలో బియ్యం మీద కూర్చున్న మల్ల అంబారీ ఎక్కిన మొనగాడులాగా ఉంది. చాట కింది చుట్టు కుదురు తలబొచ్చు మీద స్వారీ చేస్తూ ఉంది. వాడి మూతి మీద గోటితో వెదికితే మీసం మొలక దొరకటానికి సిగ్గుపడుతూ ఉంది.**

**వాడి అయ్య పల్లె నుంచి, ఊళ్ళోకి ఇలాగే చాట మోసుకొని పోయేవాడు. ఆ చాటలో బియ్యం మీద కొత్త గోతాను కుట్టిన కిర్రు చెప్పులు ఉండేవి. ఇవాళ కొడుకు, మల్ల అంతే తేడా!**

**డొంకలో దుమ్ము రేగి ఉంది. బళ్ళ చక్రాలు దొర్లిపోతూ ఇసుకకు వాతలు పెట్టి పోయాయి. ఏడాది పొడుగునా రాకపోకలకు అదే రాస్తా! వాన వస్తే అదే కాలువ. ఊరికీ వాడకూ మధ్య ఉన్న మానవ సంబంధం డొంక. దాని రెండు గట్ల మీదా చిల్ల కంప. పొద్దున్నే పుట్టిన సూర్యుడి ప్రతాపం కంప సందులోంచి వచ్చి మల్ల మీద తళతళలు సృష్టిస్తూ ఉంది. ఉదయమే ఇంత ఉద్రేకంగా ఉన్న సూర్యుడు, మధ్యాహ్నాన్ని ఎలా మాడుస్తాడో! అసలే ఎండాకాలం!**

మల్ల తొణకటం లేదు. చుక్కబొట్టు కూడా బియ్యంలో పడటం లేదు. నిండుగా, పిక్కటి బిర్లుగా, అంచులు తాకుతున్న మల్లను మప్పితంగా మోసుకుపోతున్నాడు చంద్రి.

ఏకో నారాయణ ఇంటి ప్రహరీ గోడ వాకిలి మెట్టెక్కి లోపలికి వచ్చాడు, వొద్దికగా చంద్రి. కళ్ళ ముందు లంకంత ఇల్లు. ఎప్పుడూ చూచేది. ఇవాళ కొత్తగా ఉంది. తరతరాల గ్రామ జీవితం శాసించిన అధికారం తల మీద పెట్టుకొని గర్వంగా నిలబడి ఉన్న ఇల్లు.

చంద్రి ఇంటి ముందు తలవంచుకొన్నాడు. చాట పదిలంగా దించుకున్నాడు. లోపల పక్క ప్రహరీ గోడకానుకొని కూర్చున్నాడు. చాట ముందు పెట్టుకొన్నాడు. కోట తలుపులు లాంటి దాని వాకిలి మూసి ఉంది. కుందు కూర్చున్నాడు. తలుపులింకా తెరుచుకోలేదు. ఆ ఇంటిలోకి సూర్యుడింకా ప్రవేశించినట్లు లేదు. ఎంతోసేపు కుందు కూర్చోలేక చతికిలబడ్డాడు చంద్రి.

జీతగాళ్ళు ఎవరి పని వాళ్ళు చేసుకుపోతున్నారు. సావిట్లో పశువుల కసువు తీసి పెంటపోగులో వేసి వస్తున్న జీతగాడు చంద్రిని చూచి ఆగి, ముందుకు సాగి, గొడ్డుకు మేత వేసి వచ్చి 'యేందిరా సెందిరిగా వచ్చావు?' అన్నాడు. వీడు పలకలేదు. వాడు జవాబు కోసం నిలబడ లేదు.

పశువుల అరుపులు, లేగల దూకుళ్ళు, జీతగాళ్ళ కదలికలు నీల కావిళ్ళ రాకపోకలు ఏకో నారాయణను నిద్ర లేపలేదు.

చాటాలో తండ్రి చెప్పులు తెస్తే ఇంటి జీతగాళ్ళు, చాటను బియ్యంతో సహా లోపలికి తీసుకొనిపోయి వడ్లబస్తా తెచ్చి పంచపాళీలో పెడతారు. అదే తండ్రి ఇంటికి మోసి తెచ్చేవాడు. అదే కూలి. అదే తిండి.

చంద్రి తండ్రి కూడా జీతగాడే! పొలం జీతగాడు. ఇంటికి రాడు. చెప్పులు కుట్టి తెస్తే, ఇచ్చి బైట నుంచి బైటికే వెళ్ళిపోతాడు.

'సెప్పులు కింద బియ్యం బొయ్యటంవెందుకు'

'ఈ సెప్పులేసుకొన్న దొర వొడ్ల రాసుల్లో నడవాలని'

'చాటను అలికి, ముగ్గులేసి, పసుపు కుంకాలు బొట్లు పెట్టేదెందుకు?'

'సెప్పు లేసుకొనే సోమి పెళ్ళాం పసుపు కుంకాలు కలకాలం నిలవాలనిరా సన్నాసి'

'నిమ్మకాయెందుకు?'

'నాకు తెల్డుపోరా! అన్నీ అజలు కావాలీడికి'

నిన్న ఉదయమే మేదర మామయ్య అల్లిన చాట తెచ్చాడు చంద్రి. దాన్ని ఆవుపేడతో అలికాడు. ఆరపెట్టాడు. ముగ్గులేశాడు. పసుపు కుంకాల బొట్లు పెట్టాడు. పసుపు కుంకాలు తడిపి, బియ్యంలో కలిపి, పిసికి, తలంబ్రాలు చేసి వాటి మీద మల్ల పెట్టి తీసుకొచ్చాడు చంద్రి.

ఆ మల్లలో వాళ్ళయ్య గంజి తాగాడు. అంబలి తాగాడు. మీసం తుడుచుకొనేవాడు. మల్ల మొర్రిపోయిందని అటక మీద పెడితే దాన్ని చంద్రిగాడు తెచ్చాడు.

ఏ జీతగాడు ఆ చాట ఇంట్లోకి తీసుకొనిపోతాడో తెలియదు. ఇంట్లోంచి ఏం తెస్తాడో తెలియదు. చంద్రి కూర్చునే ఉన్నాడు.

నిన్న పొద్దుట పేపర్లో చంద్రి నెంబరు పడింది. అప్పటి నుంచి వాడి ఉరుకులు పరుగులు ఒక్కటి కాదు. 'యేందిరా నువ్ జేసేది' అన్న తండ్రితో ఏమీ చెప్పలేదు. మాట్లాడితే మీసం మెలేయటం తండ్రికి అలవాటు.

వాడొక్కడే పల్లెలో మీసమున్న మొనగాడు. ఊళ్ళో ఏకోనారాయణ మీసంతో పోటీ పడగల మీసం వాడిది. తన పొలం జీతగాడి మీసం చూచి గర్వపడే ఔదార్యం అ మోతుబరిది. అందువల్ల అతడి మీసానికి శల్యం లేకుండా పోయింది.

చంద్రి చేస్తున్న పనేమిటో ఎవరికీ చెప్పలేదు. పొద్దున్నే నిద్రలేచి, అమ్మకూ అయ్యకూ చెప్పకుండా ఊళ్ళోకి వచ్చాడు.

ఎవరో జీతగాడు వచ్చి 'యేందిరది' అంటే చంద్రి పలకలేదు. ఇంటి తలుపులు తెరుచు కోలేదు. చూస్తూ కూర్చున్నారు. ఊరికే లేడు. నిప్పుల మీద కూర్చున్నట్లున్నాడు.

చంద్రి తలకాయలో ఏకోనారాయణ మీసం ఉంది.

దట్టంగా, గుబురుగా, నల్లగా, వొత్తుగా పెరిగి, మెలి దిరిగి, పైకిలేచి, రెండు కళ్ళలోకి దిగబోతున్న ఈటెల్లాగా పొగరుగా ఉంది మీసం.

ఏకోనారాయణ దాని మీద చేయిపెట్టడు. రోజుకు పదిసార్లు సవరించడు. అసలు కదిలించడు. అది కదలదు. నిటారుగా నిలబడి ఉంటుంది. ఏమివేసి, పెంచి, పోషించి, కాపాడతాడో కానీ, ఒకసారి బైటికి వస్తే, మళ్ళీ ఇంటికి వెళ్ళిందాకా అది నిక్కబొడుచుకొని పులికోరల్లాగా ఉంటుంది.

ఏకోనారాయణ మీసం తిప్పడు. మెలేయడు. మీసం మీద చేయి వేశాడో, ప్రమాదమే! ఊళ్ళో జనం అతను మీసం తాక్కుండా చూచుకొంటారు.

వంశ పారపర్యంగా తాత ముత్తాతల కాలం నుంచి వాళ్ళ మీసం మీద చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి. రాజులొచ్చినా, రమణప్పలొచ్చినా, దొరలొచ్చినా, పోయినా, వాళ్ళ మీసం పుట్టటం, పెరగడం, పండబారటం, వెండిదారాలు కావటం అంతే! ఒకసారి పుట్టిన మీసం వల్లకాటి దాకా నిక్కబొడుచుకొని ఉండాల్సిందే! తీయరు.

వాళ్ళ వంశం మీసాల చరిత్రలోని చాలా కథల్లో ఒకటి. వానల్లేక, పంటల్లేక, కరువొచ్చి, కాటకమొచ్చి, ఏకోనారాయణ ముది ముత్తాత అప్పు కావాలని కోమటిని అడిగితే, అతను తాకట్టు అడిగాడని, పొలంపుట్ర, ఇల్లూవాకిలి ఏం తాకట్టు పెడతానన్న డబ్బు ఇవ్వలేదని, మీసం పెడితే ఇస్తానన్నాడని, మండిపోయిన మీసం సొంతదారు అప్పు తీసుకోలేదని, కోమటిని ఏమీ అనలేదని, ఆకలితో మలమల మాడిపోతుంటే దయతలచి అప్పు ఇవ్వబోయిన కోమటిని క్షమించాడు కానీ, అప్పు తీసుకోలేదని, మీసమంటే పౌరుషమని, దాన్ని తాకట్టు పెట్టలేదని, చాలా కథలు చెబుతుంటారు.

ఏకోనారాయణ యస్సెల్సీలోకి రాకముందే సింహం జూలంత మీసం వచ్చింది. వంశం, ఆస్తిపాస్తులు రక్షించినట్లు మీసం కూడా రక్షించుకొంటూ వచ్చాడు.

యస్సెల్సీ ఎన్నిసార్లు తప్పినా, మీసం మాత్రం ఏమీ అవమానపడకుండా, నిటారుగా, బిర్రుగా, రవీగా, దర్జాగా, ఎరువేసి పెంచిన పైరులాగా పెరుగుతూ వచ్చింది.

పట్టు వదలని విక్రమార్కుడులాగా మార్కులు రాని విక్రముడు పరీక్షలు వ్రాస్తూనే వచ్చాడు. భారతదేశాన్ని వదిలి వెళ్ళరనుకొన్న ఆంగ్లేయులు వెళ్ళిపోయినా అతడు మెట్రిక్ పాసుకాలేదు. అప్పటికీ స్కూల్ ఫైనల్‌లోకి వచ్చిన కొడుక్కు అది పాసయ్యేపని అప్పగించి తండ్రి విశ్రాంతి తీసుకొన్నాడు. వంశపారపర్యంగా హక్కుల్ని కాపాడుకున్నట్లు కొడుకు కూడా దట్టంగా వచ్చిన మీసం కాపాడుకొంటూనే ఉన్నాడు. వంశ పారపర్యంగా ఎస్సెల్సీని ఎగరేసి తన్నటం తాను కొనసాగించటం ప్రారంభించాడు. తన్ని తన్ని అలసిపోయిడు. అలిసిపోయినా తండ్రిలాగా ఎస్సెల్సీ ఆపైన మెట్రిక్ రాస్తూనే ఉన్నాడు.

తమ వంశంలో ఎవరూ చదవనక్కరలేదు. ఉద్యోగం అవసరం లేదు. తినా కుడువా ఉన్న కుటుంబం. వాళ్ళదే పెత్తనం. మోతుబర్లు. ఊరి భూముల్లో సగం వాళ్ళదే! అన్ని ఎడ్లు! అందరు జీతగాళ్ళే! కానీ ఏం లాభం? వాళ్ళ కుటుంబంలో యస్సెల్సీ నాలుగుసార్లా తప్పి, ఆపైన మెట్రిక్ ఇష్టారాజ్యంగా తప్పుతున్నారే గానీ, పాసుకావటం లేదు. చుట్టు ప్రక్కల గ్రామాల్లో తమసాటి వాళ్ల ఇళ్లల్లో పిల్లలు యస్సెల్సీ పాసవుతున్నారు. ఏకోనారాయణకు అవమానంగా ఉంది.

ఊళ్ళో వాళ్ళు చాలామంది యస్సెల్సీ చదివి, తప్పి, చతికిలబడి, చదువు మానేసి పొలం పనులు చూచుకోబట్టి సరిపోయింది కానీ లేకపోతే తమ వంశ మర్యాద ఏమై పోయేది?

తమ జీతగాడి కొడుకు యస్సెల్సీకి వచ్చేడంటే గుండెలో కలుక్కుమన్న మాట నిజం. 'వాడిముఖం' అన్నాడు కానీ, పాసవుతాడేమోనన్న అనుమానం పట్టుకొని పీడించసాగింది.

'ఎందుకరా ఆణ్ణి సదివిత్తా, జీతానికి పెట్టక' అనీ అన్నాడు. జీతగాడు వినలేదు. స్కూలు మాన్పలేదు.

'సదివేంజేత్తావురా ఉజ్జోగం జేత్తా? ఊళ్ళేలుతా? యెందుకొచ్చింజదువురా? యదవ జదువు' అనీ వారించాడు. వాడో పిల్లకాకి. వింటాడా? వినలేదు.

మీసానికి సంపంగి నూనె రాసి దువ్వుతున్నప్పుడు కరణం వచ్చేడు.

'దొరవారెక్కడికో బయలుదేరినట్టుందే'

'యాడికీ లేదుగానీ కూసో!'

కరణం కూర్చుంటూ 'సిందిరిగాడు యస్సెల్సీ పాసయ్యేటట్టున్నాడు'

ఏకోనారయణ వెంటనే అంటుకొన్నాడు 'మాటలా? అల్లాటప్పా యవ్వారమా? పెద్దపెద్ద మొనగాళ్ళకే చేతగాలా! నూటికి పది మంది పాసయితే గొప్ప! ఈడెంత? ఈడి బిసాదెంత? ఈడేంది! పాసుగాటవేంది?'

కరణం ఊరుకోలేదు 'ఊళ్ళోవాళ్ళు చేతగానోళ్ళు. పల్లెలో పిల్లోడు మొనగాడు అనేరోజు వచ్చేట్టు ఉంది.'

'జీతగాడి కొడుకేంది? పాసయ్యేదేంది సాలూరుకో వయ్యా. అన్నీ ఉన్నోళ్లకే చేతగాలా! ఇల్లూవాకిలీ లేనోడు పొలంపుట్రా నగానట్రా, ఆస్తి పాస్తీ, దిక్కూమొక్కూ లేనోడు కూడా పాసయితే ఊళ్ళోవాళ్ళేం గాజులు తొడుక్కోలేదు.'

'ఊళ్ళోవాళ్ళేరి? ఒక్కడు! ఒక్కడంటే ఒక్కడైనా పాసయ్యాడా? లేదే! మీ వంశంలోనూ లేకపోయే'

'మా వంశంలో చదువు రాత లేదయ్యా! ఊళ్ళోవాళ్ళకేం రాశాడు? ఈడి తరమా? ఈడబ్బ తరమా! పాసుకాలేడు'

'అయి తీరతాడు. సూత్తుండు. నువ్వా నీ పెగ్గలు తుంగలో తొక్కు. మనం గాజులు తొడుక్కోవలసిందే!

ఏకోనారాయణ మండిపడ్డాడు 'ఈల్లేదు. ఆడు పాసుకాడు'

'పందెం! పాసవుతాడు!'

మీసం పైకి దిప్పుతూ 'కాడు' అన్నాడు.

'సూత్తుండు నీ మీసం కిందికి దించుకోవాలి'

ఏకోనారాయణకు చుర్రుమంది 'దించటం కాదు తీసేస్తా! ఆడు పాసయితే నామీసం తీసేత్తా!'

'నీ వల్ల గాదు!' కరణం రెచ్చగొట్టాడు

'అవుద్ది! నావల్లవుద్ది! ఆడుచ్చబోసి మీసం గొరిగిచ్చు కుంటా!'

కరణం మౌనం పాటించాడు. అంతటితో ఆగలేదు. పెదవి దాటిన మాట, ఊరు దాటి, వాడదాటి, చుట్టూ ఏడు పరగణాలు దాటి వెళ్ళిపోయింది.

చంద్రి తండ్రి కుంగినా, కుమిలినా, మీసం మెలేయటం మానలేదు.

ఏకానారాయణ ఏదో ఖయాల్లో అలా అన్నాడే కానీ, అంతా మర్చిపోయారు. పొద్దున్నే పేపర్లో చంద్రి నెంబరు పడిందని కరణం చెబితే, ఏకోనారాయణ ఇంట్లోకి పోయి తలుపేసుకొన్నాడు. నిన్నటి నుంచి తలుపు తీయలేదు. ఏడ్చాడో, నిద్రపోయాడో, పోలేదో, ఇంట్లో కదలిక లేదు. అసలే రోషానికి పోయే కుటుంబం. ఏ అఘాయిత్యమైనా చేసుకొంటాడేమోనని భయం.

తలుపు తట్టటానికి ఎవరికీ ధైర్యం చాలదు. అతను తీస్తేనే వీధి వాకిలి తలుపు తెరుచుకొంటుంది. ఇంటి వెనుక పనులు జరుగుతూనే ఉన్నాయి.

ముంగిలి, ఊడుస్తున్న చంద్రి లేవలేదు. పశువులు వస్తున్నా కదల్లేదు. ఎండనెత్తి మాడ్చినా కూర్చునే ఉన్నాడు.

పొద్దుటి నుంచి కొడుకు కనబడకపోతే, గుంటూరు పోయాడేమో అనుకొన్నారు తల్లిదండ్రులు. బువ్వేలక్కూడ రాకపోతే కంగారు పట్టుకొంది.

పనుల్లేక తీరుబడిగా ఉన్న జనం చంద్రిని గురించే మాట్లాడుకొంటున్నారు. అప్పుడు తెలిసింది వాడు ఏకోనారాయణ ఇంటి ముందున్నాడని

'మల్లలో ఏం ఉంది?'

'నీళ్ళు!'

'ఏం నీళ్ళు!'

ఎవరూ ఏమీ చెప్పలేదు.

'పూజ చాటలో తలంబ్రాలు మీద ఎంనీళ్ళు తీసుకుపోయాడు'

'మంచి నీళ్ళేమో!'

'మల్లలో ఏం మంచినీళ్ళు'

'కాదు. కంపు, వాసన, ఉచ్చ కంపు!'

ఏదో భయం, ఏదో కీడు!

తల్లిదండ్రులు ఊళ్ళోకి వచ్చారు. కొడుకును చూశారు. చాట చూశారు. మల్ల చూశారు. అది కంపుకొడుతూ ఉంది. ఇంటికి రమ్మంటే కదల్లేదు. లేపబోతే లేవలేదు.

చంద్రికి పంతం ఎక్కువ. పెన్ను కోసం అన్నం మానేసే మనిషి. వాడలిగితే కష్టం. ఎవరు చెప్పినా వినడు.

ఊరొదిలి పోవటం, బావిలో పడబోవటం, రైలు కింద తలపెట్టబోవటం- సమయానికి చూచి తీసుకొని రావటంతో సరిపోయింది. లేకపోతే చావే!

వాడు మొండివాడు. మాట వినడు. పట్టుదల ఎక్కువ. ఏదైనా చెయ్యాలంటే చెయ్యాల్సిందే! పట్టుపట్టడు. పట్టాడా మంకుపట్టే!.

ఒక్కగానొక్క కొడుకు. తెలవైనవాడు. యస్సెల్సీ పాసయ్యాడు. వాడి కోరిక తీర్చాలి. లేకపోతే చావే!


చంద్రి ఆడ కూర్చోవటంతో పంతం అర్థమయింది. భయం పట్టుకొంది.

మల్లకంపు ఊరంతా గుప్పుమంది. పల్లెంతా పాకిపోయింది. ఒక్కొక్కరే రాసాగారు. ఏమవుతుందో చూద్దామని గోడల పక్క, చూరుల కింద, చెట్ల కింద గుడి ముంగిట చంద్రిని చూస్తూ పల్లెవాళ్ళు, బంధు బలగం చేరారు. నిలబడలేని వాళ్ళు కూర్చున్నారు.

ఏకోనారాయణ ఇంటి వీధి వాకిలి తలుపులు తెరుచుకోలేదు, వాళ్ళ వంశం రాజవంశమంటారు. వాళ్ళు మాట పడరు. సాధారణంగా మాట అనరు. కాలంతోపాటు అన్నీపోయినా, రాజదర్బారు పోలేదంటారు. ఆదర్శ చక్రవర్తుల్లాగా వీళ్ళు ప్రజల్ని ప్రేమించకపోవచ్చు. కానీ ద్వేషించరు. పల్లెవాళ్ళను పల్లెత్తి మాటనరు. ఆదరిస్తారు. కొట్టరు. తిట్టరు. దౌర్జన్యం చేయరు.

అన్ని పనులూ వీళ్ళే చేయాలి. వీళ్ళు లేకపోతే వాళ్ళ పొలాలు పండవు. గింజలు ఇంటికి రావు. వడ్లు బియ్యంకావు. అన్నం కాదు. అయిదేళ్ళు నోట్లోకి పోవు.

పల్లెవాళ్ళు, ఊరివాళ్ళు చాలామంది ఆ ఇంటి జీతగాళ్ళు. వీళ్ళమీదే ఆధారపడ్డారు వాళ్ళు. వీళ్ళు





మిగతా 13వ పేజీలో

# అమృత తుల్యమైన - శొంఠి

శొంఠి వాడకం తెలియని వారుండరు. మనం రోజూ వంటకాల్లో ఉపయోగించే 'అల్లం' ఎండితే 'శొంఠి' అవుతుంది. మనదేశంలో అల్లం పండించే రైతులందరికి శొంఠి తయారీ తెలిసివుంటుంది. పచ్చి అల్లం కొమ్ములకు, తడిసున్నం రాసి ఎండిస్తారు. అందువల్లనే శొంఠి' కొమ్ము తెల్లగా వుంటుంది. జమైకా మరియు ఆఫ్రికా, జపాన్ దేశాలలో, శొంఠికి సున్నం కోటింగ్ వుండదు. అల్లం కొమ్ములను శుభ్రంచేసి అలాగే ఎండలో ఆరబెట్టి, పూర్తిగా ఎండిన తరువాత భద్రపరుస్తారు. ప్రస్తుతం 'జమైకా శొంఠి' ప్రపంచ వ్యాప్తంగా వాడుకలో వుంది. శొంఠి లేక అల్లం కొమ్మును, సంస్కృతంలో 'శృంగవీర', ఆర్ద్రక, మహా ఔషధము అని అనేక నామాలతో పిలుస్తారు.

శాస్త్రీయంగా దీని 'జింజిబర్ అఫిషినేల్' అని అంటారు. ఇది 'జింజిబరేషి' కుటుంబానికి చెందినది. ఇది బహు వార్షికము. ప్రతి సంవత్సరం కొమ్మునుంచి, కొత్త పిలకలు వస్తాయి. పెంచాలనుకొనే వారు కొమ్ములతో వుండే మొగ్గలున్న భాగం కత్తిరించే నాటితే, కొత్త మొక్కలు వస్తాయి. పత్రాలు, పసుపు మొక్క ఆకులు లాగే వుంటాయి. పుష్పాలు పసుపుపచ్చగా వుండి, మధ్యలో ఎరుపురంగు రెక్క కలిగి వుంటాయి.



అల్లం కొమ్ములో అనేక ఔషధోపయుక్తమైన గుణాలున్నాయి. అందుకే దీన్ని 'అమృత తుల్య పదార్థమని' అన్నారు. అల్లం తింటే ఒక రకమైన వగరు, తిమ్మిరి కలుగుతుంది. దీంట్లో 'ఓలటైల్' ఒగరు పదార్థం 'జింజెరాల్' వున్నందున ఈ రకమైన రుచి వుంటుంది. జింజెరోన్ అనే ఇంకొక పదార్థం ఘాటైన రుచి కలిగిస్తుంది. ఈ హోలటైల్ నూనెల్లో చాలా ఔషధోపయుక్తమైన పదార్థాలున్నాయి. వాటిల్లో ముఖ్యమైనవి 'కామ్‌ఫీన్', 'పెల్లాన్‌డ్రిన్', 'జింజెబెరైన్', 'సినోంయిల్', 'బోర్నోంయిల్', మిర్సిన్, పొటాషియమ్ ఆక్సలేట్ మొదలుగునవి. పైన పేర్కొన్న పదార్థాలన్నీ ఎక్కువభాగం కొమ్ములోని పైపొరలోనే వుంటాయి. పైన చర్మం చెక్కేసి లోపలి భాగం మాత్రమే వాడకానికి ఉపయోగిస్తుంటారు. అంటే, సగానికి సగం ఔషధంగా ఉపయోగపడే పదార్థాలు తీసివేసినట్లే లెక్క.

> అసిడిటీతో బాధపడేవారు, గ్లాసు పాలలో రెండు చిటికెల శొంఠిపొడి, పటిక బెల్లం పొడి తగినంత కలుపుకుని ప్రతిదినం తీసుకొంటే, ఆ బాధ తగ్గుతుంది. 'అల్లంపాక్' అని శొంఠి, పలకలు, కుంకుంపువ్వు, జాజికాయ, లవంగాలు కలిపి పొడిచేసి, చక్కెర పాకంలో కలిపి తయారుచేస్తారు. ఇది సర్వరోగ నివారిణిగా పూర్వం వైద్యులు, హకీమ్‌లు, జీర్ణకోశ వ్యాధులను నివారించడానికి ఇచ్చేవారు.

ఆయుర్వేదంలో దీనికి కటు-రసవు, ఉష్ణ-వీర్యము, వాత, కఫ-హర, కలు-విపాక, లఘు, సిగ్ధ, పచన, రుచి, విబంధ హార గుణాలు వున్నట్లు చెప్పబడింది.

అల్లం వంటకాలలో వాడడం అందరికి తెలిసినదే.

ప్రస్తుతం శొంఠి ఔషధ ఉపయోగాలు చర్చిద్దాం. 'శొంఠి' ఉపయోగించి తయారుచేసే 'బీర్'ను, జింజిర్ బీర్ అని అంటారు. ఇది చలిదేశాలలో వుండేవారికి, మంచి ఆరోగ్యకరమైన పానీయంగా ఉపయోగపడుతుంది. శొంఠి, మిరియాలు, పిప్పళ్ళు మూడింటిని కలిపి, 'త్రికటుకాలు' అని అంటారు. ఈ మూడు కలిపి చేసే ఔషధాలు, జీర్ణశక్తిని పెంచేవిగా వుంటాయి. ముఖ్యంగా. శొంఠి, అజీర్ణం, గ్యాస్‌ట్రబుల్, కడుపునొప్పి, వాంతులు తగ్గించగల శక్తి గలిగి వుంది. దీనిలోని వగరు పదార్థాలు, జీర్ణాశయాన్ని 'న్యూట్రల్' లో వుంచి ఎసిడిటీ నుంచి రక్షిస్తాయి. అసిడిటీతో బాధపడేవారు, గ్లాసు పాలలో రెండు చిటికెల శొంఠిపొడి, పటిక బెల్లం పొడి తగినంత కలుపుకుని ప్రతిదినం తీసుకొంటే, ఆ బాధ తగ్గుతుంది. 'అల్లంపాక్' అని శొంఠి, పలకలు, కుంకుంపువ్వు, జాజికాయ, లవంగాలు కలిపి పొడిచేసి, చక్కెర పాకంలో కలిపి తయారుచేస్తారు. ఇది సర్వరోగ నివారిణిగా పూర్వం వైద్యులు, హకీమ్‌లు, జీర్ణకోశ వ్యాధులను నివారించడానికి ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ 'అల్లంపాక్' లేక 'ల్లం మురబ్బా' వాడకం మరిచిపోయారు. దీర్ఘకాలంగా వున్న అజీర్ణం తగ్గడానికి అల్లం రసంలో, తేనె, నిమ్మరసం, చిటికెడు సైంధవలవణం కలిపి తీసుకొంటే మంచిది గొంతు నొప్పి, వాపు తగ్గడానికి ఒక ముక్క శొంఠి నమిలి మింగడంగాని, శొంఠి, బెల్లం కలిపి దంచి, బుగ్గను పెట్టుకుని నెమ్మదిగా నమిలి మింగడంగాని చేస్తే మంచిది.

ఆయుర్వేద ఔషధమయిన 'సంస్కార చూర్ణం' శొంఠి, దాల్చిన చెక్క, నాగకేసరాలు, మిరియాలు, పిప్పళ్ళు, పటిక బెల్లం కలిపి తయారుచేస్తారు. దీన్ని ఆకలి కలిగించడానికి మూలవ్యాధి తగ్గడానికి వాడుతారు. ఇదే రకంగా పైన పేర్కొన్న వన మూలికలతో, తుంగముస్తలు, పలకులు, లవంగాలు వగైరా పాలు, వెన్న, పటిక బెల్లం కలిపి లేహ్యాంలగా తయారుచేస్తారు. దీన్ని 'సౌభాగ్య శొంఠి' అంటారు. ఈ ఔషధాన్ని ప్రసవించిన స్త్రీకిస్తే గర్భసంచి శుభ్రపడి, యథాస్థితికి వచ్చి గర్భకోశ వ్యాధులు రాకుండా నివారిస్తుంది. ప్రస్తుతం 'యుటెరిక్ క్యాన్సర్', ప్రోలాప్స్ మొదలుగునవి ముందుజాగ్రత్త చర్య చేపట్టకపోవడం వల్ల వచ్చేవే అని, ప్రసవానంతరం తల్లికి ఇంతకన్నా మంచి ఔషధం లేదని, నేను సర్వేచేసిన గ్రామాల్లోని గ్రామీణ వైద్యులు అన్నారు. సయాటికా, కీళ్ళనొప్పులు వున్న రోగులకు, శొంఠి సైంధవ లవణం, పిప్పళ్ళు, చిత్రమూలు, గంజ, నువ్వుల నూనె కలిపి తయారుచేసిన, 'సైంధవాద్యతైలం' పైపూతగా వాడుతారు. కడుపులోకి, శొంఠి, ఆముదపు వేర్లు, సైంధవ లవణం కలిపి దంచిన పొడిని ఇస్తారు. దేశీయ వైద్యంలో తలనొప్పికి శొంఠి చాది పట్టువేయడం కడుపునొప్పికి, శొంఠి, చక్కెర కలిపి రెండు చిటికెలు ఇవ్వడం అజీర్ణానికి శొంఠి, వాము పలకలు కలిపి దంచి ఇవ్వడం అందరికి తెలిసిందే. శొంఠి పొడిలో సమానంగా బెల్లం, ఆవునెయ్యి, తగినంత తేనె, కలిపి, ఒక కుండలో వుంచి, మూతబిగించి, ఒక నెలరోజులు ధాన్యపురాశిలో వుంచి, ఆపైన రోజూ, రెండుపూటలా ఉసిరికాయంత లేహ్యం తింటే, 'అమృతంగా పనిచేసి, దేహధారుఢ్యం కలిగిస్తుందని అంటారు. (దేశీయవైద్యం). ప్రస్తుత పరిశోధనలలో శొంఠి వాడకం 'మోషన్ సిక్‌నెస్', కండ్లు తిరిగే 'వర్టిగో' వ్యాధిని తగ్గిస్తుందని తెలిసింది.

**-డా. యస్. వేదవతి.**

## ఇలా చేస్తే సరి!

వస చూర్ణము, తేనె కలిపి సేవిస్తే గుండె నొప్పి తగ్గిపోతుంది.

అన్నం ఉడికేటప్పుడు కొద్దిగా నూనె వేస్తే ముద్ద కాకుండా వుంటుంది.

పాలల్లో నిమ్మ రసం కలిపి పూసుకుంటే ముఖం మీది మచ్చలు పోతాయి.

ఉల్లిపాయలు వేయించేటప్పుడు చిటికెడు పంచదార కలిపితే త్వరగా వేగుతాయి.

సేమ్యాను అప్పుడప్పుడు ఎండలో వుంచుతుంటే తాజాగా వుంటుంది.

ఉమ్మెత్త ఆకుల రసంలో కొబ్బరి నూనె కలిపి రాసుకుంటే పేలు నశిస్తాయి.

ఎక్కువ గుడ్లు ఒకేసారి ఉడకబెట్టవలసి వస్తే ఇడ్లీపాత్రను ఉపయోగిస్తే సరి!

పొగాకును నానబెట్టి ఆ నీటిని చీమల పుట్టలో పోస్తే చీమలు బయటకు రావు.

మేకులను వేడి నీటిలో కాసేపు ఉంచితే గోడలో తేలిగ్గా దిగుతాయి.

గసగసాలను వెచ్చచేసి చూర్ణం చేసి తేనెతో కలిపి తీసుకుంటే వీర్యపుష్టి కలుగుతుంది.

తెల్లజిల్లేడు పాలు పిప్పి పంటిపైన వేస్తే పిప్పి పన్ను బాధ పోతుంది.

బిల్వ వేరు కషాయం రోజూ సేవిస్తూ వుంటే గుండెదడ తగ్గుతుంది.

కథ 12వ పేజీ తరువాయి

ఉంతం

బాగుంటేనే వాళ్ళ సుఖం సంతోషం.

ఈ అవసరం ఆ వంశానికి తెలుసు. ఏమీ లేని అలగా వాళ్ళతో వాళ్ళు సాధారణంగా పేచీలు పెట్టుకోరు. వీళ్ళ ఆస్తులన్నీ పొలాలే! అవి పండి ఇంటికి వస్తే సుఖం. లేకపోతే దుఃఖం. పేచీ పడితే దుఃఖమే! పంటరాదు. తగల బడుతుంది. దొంగమూక ఎందుకొచ్చిన రంపి.

ఏకోనారాయణ వంశం ఇన్నిరకాలుగా ధర్మప్రభువులు అనిపించుకొంటూనే వచ్చింది. పేరు మోసిన వంశం.

వాళ్ళు మాటంటే మాటే. ఆడి తప్పరు. సత్య హరిశ్చంద్రుడి వంశమంటారు. మాట కోసం కాటికయినా పోతారు. కాటికాపలా అయినా కాస్తారు. ఆస్తిపాస్తుల్ని, ఆలుబిడ్డల్ని అయినా వదులుకొంటారని ప్రతీతి. ఆ వంశం వారసుడు ఏకోనారాయణ.

మా తాతకు మీ తాత మాటిచ్చాడంటే ఏకోనారాయణ ఆ మాట నిలబెట్టేవాడు. మాటంటే వాళ్ళకంత గురి.

ధర్మరాజులా ఎప్పుడయినా జూదమాడతాడు. కొంత పోగొట్టుకుంటాడు. బాధపడడు. తమ పూర్వీకుల్లా వ్యసనాల్లో చిక్కుకోలేదు కానీ, వ్యసనాలే లేవంటే పొరపాటే! వ్యసనాల వల్ల ఆస్తిపాస్తులు పోగొట్టుకోలేదు. పైగా పెంచుకోసాగాడు. అడవుల పాలుగాలేదు. ఆలుబిడ్డల్ని అమ్ముకోలేదు. తరగని వంశ ప్రతిష్ట మీద భద్రంగా ప్రతిష్ఠితుడైన వాడు ఏకోనారాయణ. వంశ గౌరవ మర్యాదలను కాపాడవలసిన బరువుబాధ్యతల్ని వరుపుగా నిలుపుకొంటూ వస్తున్నాడు.

వీధి వాకిలి తలుపు కిర్రుమంది. బర్రుమంది. ఇద్దరు మనుషులు లాగితే తప్ప తలుపు తెరుచుకోలేదు.

జీతగాళ్ళు, పల్లెజనం, ఊరివాళ్ళు సావధానులై, నిశ్శబ్దంగా కదలకుండా నిలబడ్డారు. చంద్రి లేవలేదు. కదల్లేదు. మెదల్లేదు. కూర్చునే ఉన్నాడు.

తెరిచి ఉన్న తలుపుల మధ్య నుంచి ఏకోనారాయణ వస్తుంటే మీసం ముందుగా వచ్చింది. గొప్ప మీసకట్టు! తెల్లటి పంచలు కట్టుకున్నాడు. కప్పుకొన్నాడు. ఠీవిగా కూర్చున్నాడు.

కళ్ళు వాచి ఉన్నాయి. వాపును మీసాలు కప్పి ఉంచాయి. వాపుకూ మీసాలకు మధ్య వంశం పరువు ప్రతిష్ఠలతో పాటు తమ భవిష్యత్తు దాగి ఉంది.

తల్లి దండ్రులు చంద్రిని లేపమన్నారు. లేపలేదు. లేపబోయారు. వేలబడ్డాడు.

ఏకోనారాయణ వాణ్ణి లేపొద్దని నివారించాడు. గప్‌చిప్. ఎవరూ మాటాడలేదు. అంతా నిశ్శబ్దం. చంద్రి తలవంచుకొని కూర్చున్నాడు.

చంద్రి నిన్న ఉదయం నుంచి ఏమీ తినలేదనీ పచ్చి గంగ కూడా ముట్టలేదనీ, పొద్దుటి నుంచి ఎండలో మాడుతున్నాడనీ, ఇంటికి రమ్మంటే రావటం లేదనీ, తంతే పరిగానికి పోతాడని, ప్రమాదం తెచ్చుకుంటాడని భయమని మీరే ఎలా అయినా చెప్పి వాణ్ణి ఇంటికి పంపేటట్లు చేయమని వంగొంగి దండం పెట్టి ఏకోనారాయణను చంద్రి తల్లిదండ్రులు అడిగారు.

ఏకోనారాయణ ఏమీ అనలేదు. నిన్నటి నుంచి గడ్డం గీక్కోలేదు. స్నానం చేయలేదు. టిఫిన్ లేదు. అన్నం లేదు. పచ్చిగంగా కూడా ముట్టలేదు.

మంగలాయన భయం భయంగా వచ్చి కొబ్బరి నూనె తీసి రాయిమీద కత్తి నూరుకుంటున్నాడు. 'గడ్డం!' ఊరంతా గుప్పుమంది.

జీతగాడు తెచ్చిన నీళ్ళతో గడ్డం తడపబోయాడు మంగలాయన.

ఏకోనారాయణ వారించాడు. చంద్రిని చూపించాడు.

'తీసుకురా. తడుపు. మీసం గొరుగు'

పల్లెజనం, ఊరిజనం, జీతగాళ్ళు ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. పీల్చిన గాలి వదలటం లేదు. గాలిపీల్చటం లేదు.

ఏకోనారాయణ నిశ్చలంగా ఉన్నా, కళ్ళలో చలనం లేకపోలేదు. నీటి వల్ల కళ్ళలో కదిలిక వచ్చింది. ఆ నీరు బైటికి రావటం ఏకోనారాయణకు ఇష్టంలేదు. కళ్ళు మూసుకున్నాడు. పెదవి వణికింది. వణుకును మీసం దాచింది.

ఆ మీసం వెనుక ఎంతో ఆనందం ఉంది. విషాదం ఉంది. తరతరాల వంశ ప్రతిష్ఠకు అది ప్రతీక. దాని వెనుక కొన్ని శతాబ్దాల చరిత్ర ఉంది. ఆ మీసం ఒక వంశం. అచంచలంగా సాగివస్తున్న తమ వంశాధికారం, అహంకారం, హోదా, దర్జా, దర్పం, ఠీవీ, మంచితనం, మానవత్వం ఆ మీసం పునాదుల్లో స్థిరంగా ఉన్నాయి.

మీసం తీస్తే, వాటికన్నింటికి తెరపడుతుందా? అవన్నీ అంతరిస్తాయా? మంచి అంకురిస్తుందా? మానవత్వం మొలుస్తుందా? క్రౌర్యం పెరుగుతుందా? పగ మెలితిరుగుతుందా? తీసిన మీసాలు వచ్చినా, పెంచుతాడా? పెంచినా మునుపటి గౌరవం వస్తుందా? మర్యాద ఉంటుందా? తమ పూర్వీకుల వైభవానికిది చరమగీతం అవుతుందా? మంగళం పాడినట్లా? మాట నిలిపినట్లా? హరిశ్చంద్రుణ్ణి కాపాడినట్లా? కాసిన పందెం చెల్లించినట్లా? ధర్మరాజులా మిగిలినట్లా? చరిత్ర నుదుటి మీద తిలకం దిద్దుతుందా? ఇది అవమానామా? అహంకారమా? ఇచ్చిన మాట నిలుపుకోవటమా? పిరికితనమా? ఎన్ని భావాల సమ్మిళితమిది? ఇదేం పంతం? ఇదేం చర్య?

ఏకోనారాయణ స్పష్టంగా చెప్పినా మంగలాయనకు అస్పష్టంగానే వినిపించింది. సందేహంగానే ఉంది. అంతమాత్రానికే ఆకులా అల్లాడిపోయాడు. నిలబడలేక పోయాడు. తూలిపోయాడు. వాలిపోయాడు. గోడకానుకొని నిలబడ్డాడు.

ఏకోనారాయణ అన్నమాటకి రెక్కలు వచ్చాయి. గాలిలో ఎగిరింది. అందరికీ వినిపించింది. వినబడని వాళ్ళకు పక్కవాళ్ళు చెబుతున్నారు. క్షణాల్లో ఊరువాడా ప్రతిధ్వనించాయి.

చంద్రి వినలేదు. లేవలేదు.

ఏకోనారాయణ మంగలాయన్ని ఉరిమి చూశాడు. ఉలిక్కిపడ్డాడు. కళ్ళు పొమ్మన్నాయి. పోబోయాడు. తెమ్మన్నాడు. కాళ్ళు తేబోయాయి. కళ్ళతో మందలించాడు. గద్దించాడు. అనునయించాడు. బతిమాలాడు. ఆత్మీయంగా, ప్రేమగా, నిశ్చలంగా తలదించుకొన్నాడు.

నీళ్ళలో చేయి ముంచి వణుకుతూ మీసం మీద చేయి పెట్టబోయాడు 'ఆగు!' అన్నాడు ఏకోనారాయణ. కోపంలేదు. తాపంలేదు. 'మల్ల తీసుకురా!'. విన్నాడు. వినలేదు. కదిలాడు. కదల్లేదు. 'పో' అన్నాడు. పోబోయాడు. పోలేదు. 'తే' అన్నాడు. తేబోయాడు. తేలేదు. మంగలాయన నెమ్మదిగా మెట్లుదిగి, వెనుదిరిగి చూస్తూ, పదిగజాలు, పది మైళ్ళులాగా నడిచి చంద్రి దగ్గరకు పోయాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

నిన్నటి నుంచి అన్నం తినని వాడు, నీళ్ళు తాగని వాడు, నిద్ర పట్టని వాడు, చాట అలంకరించిన వాడు, మల్ల మోపినవాడు, ఎండలో మాడినవాడు, నీరసించిన వాడు, ఎవరులెమ్మన్నా లేవనివాడు, చంద్రి లేచి నిలబడ్డాడు. ఉక్కు కడ్డీలా నిలబడ్డాడు.

చాట తీసుకొని పోవటానికి వంగిన మంగలాయన్ని చంద్రి దూరంగా నెట్టాడు.

చంద్రి చాటను కాలితోనే కాలిమీదికి లాక్కొన్నాడు. లేపుకొన్నాడు. లేచిందాన్ని పైకి ఎగరేశాడు. ఎగిరిందాన్ని ఒక్కతన్ను తన్నాడు. మల్ల వొరిగింది. మొర్రికారింది. తలంబ్రాలు తడిశాయి. తడుస్తూ ఆకాశంలోకి ఎగిరాయి. ఎగిరిన చాట, బియ్యం మల్ల తడితడిగా ప్రహరీ గేటు మెట్లమీద, నేలమీద, వాకిట్లో, బాటలో పడ్డాయి. చాట వెల్లకిల పడింది. మల్ల పగిలింది. బియ్యం తలంబ్రాలు చల్లాయి. వీధంతా కంపు.

చేతిలోంచి చుట్టుకుదురు నేలకేసి కొట్టి, పల్లెవైపు తలెత్తుకొని నడిచిపోతున్నాడు చంద్రి.

★

వచ్చేవారం కథ

**బహువచనం**

-వైశాలి, డి. ఆర్. ఇంద్ర